క్లుప్తంగా

వైద్యవిద్యార్థినికి విద్యానిధి



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రియా ఏంజిల్ నీట్ ఎంట్రెన్స్‌లో రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించి మొదటి ఫేజ్‌లో వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా ఫీజు చెల్లించలేని విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని మాట్లాడారు. విద్యానిధి నుంచి రూ.25వేలను వైద్యవిద్య కోసం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇలాంటి సరస్వతి పుత్రికలను ప్రోత్సహించేందుకు నగరంలోని పారిశ్రామిక వేత్తలు, వివిధ వ్యాపారులు, ఉద్యోగులు తమవంతుగా విద్యానిధికి చేయూత ఇవ్వాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు గోవుల తరలింపు



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామికి భక్తులు కానుకలుగా సమర్పించిన నాలుగు గోవులను శనివారం ఆలయ సిబ్బంది హన్వాడ మండలం చిన్నదర్పల్లిలోని శ్రీలక్ష్మి గోశాలకు ఆటోలో తరలించారు. గోవుల సంరక్షణకే గోశాలకు తరలిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మధనేశ్వరెడ్డి తెలిపారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



దేవరకద్ర: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం కౌకుంట్ల మండల కేంద్రంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఆల్‌ఇండియా కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఓటు చోరీకి వ్యతిరేకంగా కౌకుంట్లతోపాటు వెంకటగిరి, రేకులంపల్లిలో సంతకాల సేకరణ చేశారు. ఓటు చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఓటు చోరీకి సంబంధించి ఆధారాలు బయట పెట్టినా ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోకుండా బీజేపీ కనుసన్నల్లో పని చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో ఓబీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు నరేశ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మహమ్మదాబాద్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం మహమ్మదాబాద్ మండలంలో చోటుచేసుకుంది. మహమ్మదాబాద్ మండలం అన్నారెడ్డిపల్లికి చెందిన వికాస్ పనిమీద మండల కేంద్రానికి వెళ్తుండగా.. సమీపంలో బైక్ అదుపు తప్పి ఇంద పడ్డాడు. కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇవ్వగా.. వెంటనే వచ్చినవారు వికాస్‌కు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. వికాస్ ఎడమ చేయి విరిగిందని, ఎడమ మోకాలికి తీవ్ర గాయమైందని ఈఎంటీ జానమ్మ, పైలెట్ అక్బర్ తెలిపారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

పాలమూరు: కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయాలు జరుపుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో గజిటెడ్ ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ నీలమ ఆధ్వర్యంలో శనివారం వన్‌టౌన్ పరిధిలో ఉన్న సహస్ర హోల్‌సెల్ కూల్‌డ్రింక్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. దీంతో దొడ్ల కంపెనీకి చెందిన 24బాదం మిల్క్ బాటిల్స్ కాలం చెల్లిపోయి(ఎక్స్‌పైరీ)న వాటిని విక్రయిస్తున్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఆ దుకాణంలో మిగిలిన అన్నిరకాల కూల్ డ్రింక్ కాలపరిమితి సైతం అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీలపై పంచనామా తయారు చేసి అదనపు కలెక్టర్‌కు అందజేయనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు ఇస్తారా లేక దుకాణం సీజ్ చేస్తారా చూడాల్సి ఉంది. ఈ తనిఖీల్లో వన్‌టౌన్ సీఐ అప్పయ్య, ఎస్‌ఐ శీనయ్య, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది వాజిద్ పాల్గొన్నారు.







అలుగులు పారాయి.. పంటలు ఒరిగాయి



గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉమ్మడి మండలంలోని చెరువులు, వాగులు, కుంటలు నిండి శుక్రవారం అలుగులు పారాయి. చిన్నచింతకుంట, పర్దిపురం, తిర్మలాపురం, అప్పంపల్లి, ముచ్చింతల చెరువులు నిండి అలుగులు పారాయి. అలాగే ఊకచెట్టు వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు అలుగులు పారాయి. మండలంలోని గూడూరు, కౌకుంట్ల మండలంలోని తిర్మలాపురం, అప్పంపల్లిలో వర్షానికి దాదాపుగా 50 ఎకరాలలో వరిపంటలు నేలకొరిగాయి. పంట గింజలు పట్టి చేతికి వచ్చే సమయానికి భారీ వర్షానికి నేలకు వరగడంతో పంటంతా నేలపాలై తీవ్రనష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– చిన్నచింతకుంట

న్యూమోతీనగర్‌కు రోడ్డు నిర్మించాలి



దీక్షలో కూర్చున్న న్యూమోతీనగర్ కాలనీవాసులు

- దీక్షలో కూర్చున్న కాలనీ వాసులు
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): న్యూమోతీనగర్ కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక న్యూమోతీనగర్ వెళ్లేదారి గాండ్లోని చెరువు వద్ద దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా న్యూమోతీ నగర్ రోడ్డు సాధన నాయకులు కాశపోగు ప్రసాద్ మాట్లాడుతూ.. న్యూమోతీనగర్‌కు వెళ్లేందుకు ఏకైక మార్గమైన గాండ్లోని చెరువు మార్గం ఒక్కటే దిక్కనని పేర్కొన్నారు. చిన్న వాన పడితే రైల్వే అండర్‌పాస్ జలమయమవుతుందని, దీంతో కాలనీకి వెళ్లేందుకు మార్గం మూసుకుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గాండ్లోని చెరువు క్రమంగా కబ్జాకు గురికావడంతో మాకున్న ఏకైక మార్గం జలమయం అవుతుందన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. 50ఏళ్లుగా ఈ సమస్య నానుతూనే ఉందని ప్రజా ప్రతినిధులు అనేకసార్లు హామీ ఇచ్చినా ఇప్పటికీ రోడ్డు సౌకర్యం కల్పించలేదని ఆరోపించారు. తమ కాలనీకి రోడ్డును సాధించేదాక పోరాటం చేస్తామని హెచ్చరించారు. లేదంటే వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయా పార్టీల నాయకులను ఓడిస్తామన్నారు. కాలనీ దీక్షకు బీఆర్ఎస్ మద్దతు తెలిపింది. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజు మాట్లాడుతూ.. న్యూమోతీనగర్ కాలనీవాసులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. చిట్టమ్మ, జ్యోతియాదవ్, నాగయ్య, భగవంతు, విజయ్, శంకర్‌రావు, నారాయణ, దాసు దీక్షలో కూర్చొగా.. బీఆర్ఎస్ నాయకులు వర్ధ భాస్కర్, రాజు, శేఖర్, మైమూద్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, శివశంకర్, మధు మోహన్, నాగేశ్ తదితరులు మద్దతు తెలిపారు.

‘సీజేఐపై దాడికి నిరసనగా దేశవ్యాప్త ఉద్యమం’

మహబూబ్‌నగర్ రూరల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై దాడి హేయమని, రాజ్యాంగంపై దాడి చేయడమేనని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అత్యున్నత పదవుల్లో ఒకరైన సీజేఐపై షూతో దాడికి యత్నించడం దారుణమని, దాడి ఘటనను సుప్రీం కోర్టు, ఢిల్లీ పోలీసులు సుమోటాగా తీసుకొని న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలంటూ పదిరోజులపాటు దేశవ్యాప్తంగా తీసుకోబోయే నిరసన ఉద్యమ కార్యాచరణ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 13న చలో కలెక్టరేట్, 17న మండల కార్యాలయాల ముట్టడి, 22న చలో హైదరాబాద్ మహా ర్యాలీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో నాయకులు కమలాకర్, యాదయ్య, కొండయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, శ్రీరాములు, కిరణ్, నాగయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి

ఒకచోట బాగు చేస్తే.. మరోచోట లీకేజీ!



షాషాబ్‌గుట్టకు వెళ్లే మలుపు వద్ద లీకేజీని సరిచేసి మెయిన్ రోడ్డుపై పూడ్చిన కంకర



ధర్మాపూర్ శివారులో ఎన్‌హెచ్-167 పక్కన పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ

- నగరంలో మిషన్ భగీరథ పథకం తీరు
- తలలు పట్టుకుంటున్న మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇటీవల నగర పరిధిలో పలుచోట్ల మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయి. వీటిని బాగు చేసిన కొన్ని రోజులకే తిరిగి వేరే చోట లీకేజీలు బయట పడుతున్నాయి. ఈనెల 7న రాంరెడ్డిగూడెం వద్ద మెయిన్ పైపులైన్ లీకేజీకి గురైంది. అలాగే గత నెలాఖరులో ఎన్‌హెచ్-167పై షాషాబ్‌గుట్టకు వెళ్లే మలుపు వద్ద లీకేజీ ఏర్పడింది. కార్పొరేషన్ అధికారులు ఈ రెండు చోట్ల ఈనెల 8న మరమ్మతు పనులు పూర్తి చేశారు. మూడు రోజులు కాగానే శనివారం సాయంత్రం ధర్మాపూర్ శివారులో మెయిన్ పైపులైన్ లీకేజీకి గురైంది. ఆ ప్రాంతంలోని జడ్చర్ల-రాయచూర్ జాతీయ రహదారిపైకి మొత్తం తాగునీరు ఏరులై పారింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది వెంటనే రాంరెడ్డి గూడెం వద్ద ఉన్న పంప్ హౌస్ వద్దకు చేరుకుని తాగునీటి సరఫరాను నిలిపివేశారు. కాగా, ఈ లీకేజీకి బాగు చేస్తున్నందున ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం నుంచి నగరానికి తాగునీటిని పునరుద్ధరిస్తామని కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

శతాబ్ది ఉత్సవాలు గుర్తుండిపోవాలి

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను రాష్ట్రంలోనే గుర్తుండిపోయేలా ఉత్సవాలు చేయాలని రిటైర్డ్ ఎస్‌సీసీ అధికారి పాండురంగం పిలుపునిచ్చారు. పట్టణంలోని చంద్రగార్డెన్‌లో శనివారం శతాబ్ది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 1925లో ప్రారంభమైన పాఠశాల వందేళ్లు పూర్తి చేసుకోవటం, ఉత్సవాలు జరుపుకొనే అవకాశం దక్కిన ప్రతి పూర్వవిద్యార్థి గర్వించాలన్నారు. నవంబర్‌లో మూడురోజులపాటు ఉత్సవాలు జరుపుకొనేందుకు కమిటీ నిర్ణయించడం.. అందుకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉత్సాహంగా అంగీకరించి పెద్దఎత్తున జయప్రదం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అలాగే మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సావనీర్‌కు, కాల్వ రాంరెడ్డి షీల్డులు, మెమెంటోలు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. ఉత్సవాలకు సమకారం అందిస్తామని ముందుకొచ్చిన న్యాయవాది గిరిధర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఎర్ర శేఖర్, బీజేపీ నాయకుడు శాంతికుమార్, జక్కా రఘునందన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రిటైర్డ్ హెచ్‌ఎం శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు రోజుల ఉత్సవంలో ప్రతి పూర్వ విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలని, బడిలో చదివిన ఎంతోమంది ఉన్నతస్థానాల్లో ఉన్నారని వారిని గుర్తించి పిలవాలన్నారు. ఎంఈఓ మంజులాదేవి, హెచ్‌ఎంలు చంద్రకళ, గోవింద్‌నాయక్, రిటైర్డ్ ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, విశ్వనాథం, చంద్రారెడ్డి, విశ్వనాథం, నయీమొద్దీన్, జమీలాబేగం మాట్లాడుతూ.. ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. అంతకు ముందు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థిని పరిమళ స్వాగత నృత్యం చేసింది. హైస్కూల్‌లో పనిచేసి, చదివి వివిధ కారణాలతో మృతిచెందిన వారి ఆత్మశాంతికి నిమిషంపాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్, హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు గిరిధర్‌రావుతోపాటు పెద్ద సంఖ్యలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈఓ మంజులాదేవి

టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఐదు కేంద్రాల్లో భగవద్గీత కంఠస్థ, భావ విశ్లేషణ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ జిల్లా కార్యక్రమ నిర్వాహకులు రామాచారి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూడు విభాగాల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు ఉంటాయన్నారు. మొదటి గ్రూప్‌లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 14వ అధ్యాయం గుణత్రయ విభాగ యోగం, రెండో గ్రూప్‌లో పదో తరగతి నుంచి ఇంటర్ వరకు 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగం, మూడో గ్రూప్‌లో 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వారికి నిత్య జీవితంలో భగవద్గీత భావ విశ్లేషణపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 8, 9 తరగతులకు, 18 ఏళ్లలోపు 18 ఏళ్లు పైబడిన వారికి సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 11న నారాయణపేటలోని గీతా భారతి స్కూల్, 18న గద్వాలలోని శ్రీసరస్వతి టాలెంట్ స్కూల్, 23న వనపర్తి జిల్లా తాటిపాములలోని శ్రీరీతాంబర విద్యాలయం, 25న మహబూబ్‌నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో, 27న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో కంఠస్థ, భావ విశ్లేషణ పోటీలు ఉంటాయని చెప్పారు. ఈ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

మంత్రి వాకిటి పరామర్శ

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఆర్‌ఐసీయూలో చికిత్స పొందుతున్న మక్తల్ నియోజకవర్గానికి చెందిన రోగిని శనివారం మంత్రి వాకిటి శ్రీహరి పరామర్శించారు. సాయంత్రం ప్రాంతంలో జనరల్ ఆస్పత్రికి వచ్చిన మంత్రి నేరుగా ఆర్‌ఐసీయూకి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న రోగిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్, ఆర్‌ఎంవోలు జరీనా, సమత మంత్రివెంట ఉన్నారు.

‘ధన్‌ధాన్య కృషి యోజన’ రైతులకు వరం



కొల్లూర్‌లో వేరుశనగ విత్తనాలను అందజేస్తున్న మార్కెట్ చైర్మన్, అధికారులు

నవాబుపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధన్ ధాన్య కృషియోజన పథకం రైతులకు వరం లాంటిదని మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం తెలిపారు. శనివారం ఆయన మండలంలోని కొల్లూర్ రైతువేదిక వద్ద రైతులకు ఉచితంగా అందించే వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకుని ఇతరులకు మార్గదర్శకంగా మారాలన్నారు. కేంద్రం ప్రధానంగా చిరు, పప్పుధాన్యాల సాగుపై ప్రత్యేక పథకం ఏర్పాటు చేసిందని, దీన్ని అందరు రైతులు పాటించి వాటిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణకిషోర్, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాంనాయక్, కాంగ్రెస్ నాయకులు రాంచంద్రయ్య, వాసుయాదవ్, వెంకటేశ్‌గౌడ్, ఖాజా, కృష్ణ, రవీందర్, నవాజ్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

ప్రజాభద్రత-పోలీసుల బాధ్యత

జడ్చర్ల: ప్రజల భద్రత పోలీసుల బాధ్యత అని సురక్ష కళాజాత బృందం విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీ టీం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం(ఏహెచ్‌టీయూ) ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థులకు చట్టపరమై, సామాజిక అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ విలువలతో కూడిన జీవనం గడపాలని సూచించారు. సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930ను వినియోగించుకోవాలని కోరారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్‌ను నాశనం చేస్తాయని, వీటి రవాణా, అమ్మకాలు, తయారీకి సంబంధించి సమాచారాన్ని పోలీస్ కంట్రోల్ నంబర్ 8712659360కు ఇవ్వాలన్నారు. క్యాక్రమంలో ప్రిన్స్‌పాల్ అనిత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహమ్మదాబాద్/భూత్పూర్/అడ్డాకుల: రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూభారతిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులను కార్యాలయానికి ఊరికే తిప్పుకోవద్దని సూచించారు. దీంతోపాటు ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని ఆ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మండలంలో ఉన్న రైస్ మిల్లులను పరిశీలించారు. వానకాలం 2024–25 సీజన్, సీఎంఆర్ రైస్ పెండింగ్ రైస్ మిల్లులు 24గంటలపాటు నడిపించి అనుకున్న సమయానికి రైస్ డెలివరీ చేసేలా చర్యలు తీసుకోవాలని యాజమానులను ఆదేశించారు. గత వానకాలానికి చెందిన ధాన్యం 92శాతం డెలివరీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన 8శాతం కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు తరచూ తనిఖీ చేయాలని సూచించారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

■ భూత్పూర్ మండలంలోని పోతులమడుగు వద్ద నరేశ్ రైస్‌మిల్లు, అడ్డాకుల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహ రైస్‌మిల్లును శనివారం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. రైస్‌మిల్లులో బియ్యాన్ని పరిశీలించి సీఎంఆర్ పెండింగ్ గురించి వాకబు చేశారు. 24 గంటలు రైస్‌మిల్లును నడిపించి నిర్దేశిత సమయానికి బియ్యాన్ని సరఫరా చేయాలని సూచించారు. 2024–25వ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు.

సత్తా చూపిస్తాం.. స్తంభింపజేస్తాం



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీసీ జాగృతి సేన నాయకులు

- బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్
- తెలంగాణ చౌరస్తాలో నిరసన

మెట్టుగడ్డ: చట్టబద్ధతతో కూడిన 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే బీసీల సత్తా చూపిస్తామని, రాష్ట్రాన్ని స్తంభింపజేస్తామని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బీసీ జాగృతిసేన, బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనవారం నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఇచ్చిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి, కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే చెల్లని జీవో తెచ్చి, కోర్టు స్టే ఇవ్వడానికి అవకాశం కల్పించారని విమర్శించారు. ఈనెల 16న బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే మోసపు మాటలకు కాలం చెల్లిందని, ఈనెల 14న నిర్వహించే బంద్‌తో బీసీ రిజర్వేషన్ల బిల్లు అమలు చేయడమా? ముఖ్యమంత్రి పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయడమా? బంతి ఆయన కోర్టులోనే ఉందని తెలిపారు. బంద్‌కు రాజకీయాలకు అతీతంగా బీసీ కులసంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి లోకం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ స్వామి, బీసీ జాగృతిసేన నాయకులు వెంకటేశ్ యాదవ్, పాలమూరు యూనివర్సిటీ నాయకులు తాయప్ప, విజయ్‌కుమార్, శివాజీ, శ్రవణ్, నరేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు పనులు ప్రారంభం



సర్వీసు రోడ్డులో భాగంగా చేపడుతున్న డ్రైనేజీ పనులు

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీలో కొత్త బస్టాండ్ ప్రాంతంలో రాఘవేంద్ర టాకీస్ నుంచి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వరకు రూ.కోటి20లక్షలతో నిర్మించే సర్వీసు రోడ్డు పనులను ప్రారంభించారు. ఇరుకుగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణానికి వ్యాపారులు షాపుల ముందు కొంత స్థలాన్ని ఇవ్వడానికి ముందుకురావడంతో సర్వీసు రోడ్డు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రాఘవేంద్ర టాకీస్ నుంచి కోయిల్‌సాగర్ రోడ్డు వరకు రోడ్డును వెడల్పు చేసి డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. అలాగే కోయిల్‌సాగర్ రోడ్డు నుంచి ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వరకు డ్రైనేజీ నిర్మాణానికి కాల్వను తీసే పనులు చేపట్టారు. డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత రోడ్డు పనులు చేపడుతామని సంబంధిత అధికారులు తెలిపారు. రోడ్డు వెడల్పు 7మీటర్లు దాదాపు 23అడుగుల వరకు ఉంటుందని తెలిపారు. డ్రైనేజీ పనులు ఒక వైపు పూర్తి కాగా మరోవైపు చేపడుతున్నారు. డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి



రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మల్లు నర్సింహారెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రైతులు వాణిజ్య పంటల సాగుపై దృష్టిసారించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని ఓబ్లాయిపల్లి, పోతన్‌పల్లికి చెందిన సుమారు 40 మంది రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రూ.2 లక్షల్లోపు రైతు రుణాలను ఏకకాలంలో మాఫీ చేసి రైతులకు ప్రభుత్వం రుణ విముక్తి కల్పించిందని గుర్తుచేశారు. ప్రతిసారి ఒకే రకమైన పంటలను సాగు చేయకుండా వాణిజ్య పంటలు పండించేందుకు ఆసక్తి చూపించాలని సూచించారు. వరి, పత్తి కన్నా పప్పు దినుసుల సాగులో అధిక లాభాలు ఉంటాయని, పెట్టుబడి తక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శృతి, నాయకులు మాధవరెడ్డి, గోవింద్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, బాలయ్య, రఘునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు ఆదర్శం

భూత్పూర్: మహ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి ఆదర్శనీయమని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ధార్మిక వేత్త ఆజం హజ్రత్ సయ్యద్ ఆలే ముస్తఫా అన్నారు. శుక్రవారం రాత్రి అంజుమనే బజ్మే ఖాద్రియ కాజ్మియా మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జహంగీర్ పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో నెలవారి మహెఫిలే మిలాద్ ముస్తఫా, హల్ ఖా ఏ జికర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని సందేశమిచ్చారు.

జేపీఎన్‌సీలో రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ ఇంజినీరింగ్ కళాశాలలో జయప్రకాశ్ నారాయణ్ జయంతిని పురస్కరించుకుని శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కృషిచేస్తున్నారని, చదువుకున్న విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీలను ప్రారంభించామన్నారు. టోఫెల్, జీఆర్ఈ వంటి అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలు ఇక్కడ నిర్వహిస్తున్నామని, వాటిద్వారా వచ్చే ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ కేఎస్ రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, కంట్రోలర్ సందీప్, బ్లడ్‌బ్యాంక్ అధికారి బాలయ్య, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా శ్రమదానం చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్వచ్ఛందంగా విద్యార్థులు క్యాంపస్‌లో శ్రమదానం చేయాలని ఉన్నత హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. పీయూలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 5, 8 ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న క్యాంపులో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

■ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని లా కళాశాలల్లో స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు చేపట్టాలని కోరుతూ పీయూ విద్యార్థి సంఘాల నాయకులు స్టేట్ హయ్యర్‌ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు నాగమ్మ అనారోగ్యానికి గురై చనిపోయింది. శ్రీలక్ష్మి గ్రామాభివృద్ధి సంఘం సహాయ నిధి ద్వారా పొదుపు సంఘం సభ్యులు రూ.11వేలను పోగు చేసి శనివారం మృతురాలి కుమారుడికి అందజేశారు. నాగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఓఏ నసీరొద్దీన్, మహిళలు సుశీల, పద్మ, అంజమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.